క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న అధికారులు

ముదిగొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ సుజిత్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ముదిగొండలో నూతనంగా నిర్మించిన సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామితో కలిసి సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, సీఈఓ వెంకటరత్నం, సొసైటి సిబ్బంది మరికంటి సతీష్, బాషా, శ్రీను, జానిమియా, కందిమళ్ల లక్ష్మయ్య, ప్రసాద్ లు పాల్గొన్నారు.

నీలాద్రీశ్వరుడికి రాగి కవచాలంకరణ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెనుబల్లి: మండల పరిధిలోని నీలాద్రీశ్వరాలయంలోని నీలాద్రీశ్వరుడికి భక్తులు సోమవారం రాగి కవచాలు వితరణగా అందజేశారు. విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం ఆషాడ శుద్ధ, పంచమి తిథి సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్ రజిని కుమారి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్..

పెనుబల్లి : వీయంబంజర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు రమేష్‌కు జోనెబోయిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రై సైకిల్ వితరణగా సోమవారం అందజేశారు. ఐదు సంవత్సరాల క్రితం అందించిన ట్రై సైకిల్ పాడవడంతో.. పెనుబల్లికి చెందిన బిజవాడ చంటి ఇచ్చిన రూ.10 వేల వితరణతో జోనెబోయిన చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు అన్నపూర్ణ ద్వారా ట్రై సైకిల్‌ను దివ్యాంగుడికి అందించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వైరా: వైరా మున్సిపాలిటీలోని గండగలపాడులో అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం అందించగా.. కలెక్టర్ అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని సుధాకర్ తెలిపారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామానికి 4, 5 ఇళ్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నారు. కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, మణి, నరసింహారావు, రవి, విద్యాసాగర్, వీరమ్మ, లక్ష్మయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సత్తుపల్లి పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

సత్తుపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సత్తుపల్లి పట్టణ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో 9మంది కార్యవర్గ సభ్యులను, 17మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తెలిపారు. కార్యదర్శిగా నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా నర్సింహారావు, మరొక సహాయ కార్యదర్శిగా వీరయ్యతో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లిటౌన్ కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి యోబు, సీపీఐ టౌన్ సహాయ కార్యదర్శి వీరయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు

కారేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించటం అభినందనీయమని ప్రముఖ ప్రజావైద్యుడు సామినేని రాఘవులు అన్నారు. సోమవారం కారేపల్లి స్టేషన్‌రోడ్డులోని వెన్ను కాంప్లెక్స్‌లో వైద్యుడు రూపేష్ కుమార్ ఎండీ సారధ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమలాదేవి హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని, సేవాభావంతో వైద్యం అందించటం వలన పలువురి మన్ననలు పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో విద్వాన్ విద్యాసంస్థల చైర్మన్ తాతా శ్రీనివాసరావు, కరస్పాండెంట్ జేమ్స్, గ్రామ పెద్దలు సూర్యదేవర వెంకటేశ్వర్లు, బి శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

వర్షం.. రైతుల్లో హర్షం

తల్లాడ: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. తల్లాడ మండలంలో 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ వర్షం పంటలకు ఎంతగానో ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి సాగు చేసే రైతులు దుక్కులు దున్ని దమ్ము చేయటానికి అనుకూలంగా ఉంది.

జమకాని గ్యాస్ సబ్సిడీ

- 'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఆందోళన
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పథకాల దరఖాస్తు బ్రోచర్

ముదిగొండ: ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం గ్యాస్ సబ్సిడీని అందించడమే లక్ష్యంగా అమలు చేసింది. ఎన్నిక ముందు ఆరు గ్యారెంటీల్లో భాగంగా అందులోని మహాలక్ష్మి పథకం నిరుపేదలకు వరంగా మారింది. రూ.500లకే వంట గ్యాస్ అందుతుందనుకున్న పేదలకు అది అందని ద్రాక్ష గానే మిగిలింది.

ఎదురు చూస్తున్న లబ్ధిదారులు..

హామీని ప్రభుత్వం కొంతకాలం అమలు చేసింది. తరువాత నుంచి నగదు పడకపోవడంతో మహిళలు, వినియోగదారులు సబ్సిడీ నగదు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యాస్ ఏజెన్సీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, వారి ఖాతాల్లో మాత్రం రాయితీ డబ్బులు జమ కావడం లేదు.

మండలంలోని వివరాలిలా..

ముదిగొండ మండలలోని 25గ్రామపంచాయతీలు, 33గ్రామాలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 60వేల వరకు జనాభా ఉన్నారు. మొత్తం 19,108 రేషన్ కార్డులున్నాయి. రేషన్ కార్డుల ప్రాతిపదికన చూసినా దాదాపు కొత్తవి, పాతివి కలిపి 25వేలు పైచిలుకు ఉంటాయని అంచానా. అయినప్పటికీ అర్హులైన నిరుపేదలకు రాయితీపై సిలెండర్‌కు నగదు జమ కాకపోవడంతో లబ్ధిదారులు నిరుత్సాహ పడుతున్నారు. సక్రమంగా పథకం అమలు చేయాలని, రాయితీ పైకం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని మహాలక్ష్మీలు కోరుతున్నారు.

అమలుకు నోచుకోని సబ్సిడీ..

సంవత్సరానికి 6 సిలెండర్లు వాడకంపై, ఒక్కో సిలెండర్‌కు రూ.934గ్యాస్ ఏజెన్సీకి చెల్లిస్తే, తిరిగి వారి ఖాతాలోకి రూ.500 మినహా మిగతావి రూ.334 జమ కావాలి, కాని అలా ఖాతాల్లో జమ కావడం లేదని పేదలు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడంలేదు. పూర్తి నగదు చెల్లించాల్సిన పరిస్థితి నెలకుంది. 2023 డిసెంబర్ లో నుంచి, 2024జనవరి 6వ తేది వరకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం కొద్ది కాలం పాటు కొదరికి జమ చసి, నవంబర్ నుంచి పూర్తిస్థాయిలో సబ్సిడీ నగదు జమ చేయడం లేదు.

ఎన్నడూ ఖాతాలో జమ కాలేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి కొత్త పథకాలు అమలు చేసేదాంట్లో గ్యాస్ సబ్సిడీ డబ్బులు ఎన్నడూ ఖాతాలో జమ కాలేదు. చాలాసార్లు బ్యాంకులు, గ్యాస్ డీలర్లను సంప్రదించిన ఉపయోగం లేకుండా పోయింది. పూర్తి డబ్బులు ఇచ్చి సిలిండర్ తీసుకుంటున్నాం.

– కందికట్ల వెంకట్రావమ్మ, పెద్దమండవ

రూ.18కి మించి పడడం లేదు..



కొత్త ప్రభుత్వం వచ్చాక మహాలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్నా, కాని ఇప్పటి వరకు ఖాతాలో రాయితీ డబ్బులు పడడం లేదు. కేవలం 18రూపాయలు మాత్రమే జమ చేస్తున్నారు. రూ.500లకే గ్యాస్ అనే మాట ఉత్తదే. ఇప్పటికైనా సబ్సిడీ నగదు జమ చేస్తే బాగుంటుంది.

– గూటి లక్ష్మి, గంధసిరి

5న న్యాయవాదులకు అవగాహన సదస్సు



సదస్సు వివరాలు వెల్లడిస్తున్న ఐఏఎల్ బాధ్యులు, న్యాయవాదులు

మధిర: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యాన 5వ తేదీన మధిరలో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. మధిరలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయవ్యవస్థలో వచ్చిన మార్పులపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఈ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈమేరకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు పాల్గొననుండగా న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఒరుగంటి శేషగిరిరావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావుతో పాటు రమేష్, కావూరి రమేష్, వెంకట్రావు, తోట రామాంజనేయులు, కోట జ్ఞానేష్, చావలి రామరాజు, గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టండి

సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న రమేష్

సత్తుపల్లి: బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టాలని జిల్లా అకాడమిక్ సెల్ బాధ్యుడు బండారు రమేష్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. సీపీఎం సత్తుపల్లి పట్టణ, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో రావి వీర వెంకయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి వ్యవహరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సీపీఎం డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాండు రంగారావు, శ్రీనివాస్, సర్వేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

చింతకాని: శ్రామికులు రోజుకి 9 గంటలు పనిచేస్తున్నప్పటికీ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని, పనికి తగిన వేతనం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారి వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమాజం అభివృద్ధి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ముదిగొండ: వర్గ పోరాటాలతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో జరుగుతున్న సీపీఎం మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని.. పార్టీ అఖిల భారత తీర్మానాలను సభ్యులకు వివరించారు. మానవ జాతీ చరిత్ర అంతా వర్గ పోరాట పోరాట చరిత్ర అని అన్నారు. అమెరికా ఆదిపత్య ధోరణి ప్రదర్శిస్తుందని అన్నారు. సాయంత్రం జరిగిన తరగతుల్లో రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల నాయకులు వేల్పుల భద్రయ్య, మంకెన దామోదర్, మరికంటి వెంకన్న, బొజ్జ అశోక్, కుటుంబరావు, కోలేటి అరుణ, మందరపు పద్మావతి, వెంకయ్యలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరారూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గన్నవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న రుణాలను మాఫీ చేయాలన్నారు. అలాగే సీతారామ ప్రాజెక్టుకు వైరా రిజర్వాయర్ అనుసంధానం కోసం ప్రభుత్వం నిర్మాణం చేసిన రాజీవ్ లింక్ కెనాల్‌ను ఏన్కూరు దిగువ భాగంలో కలపడం వలన 14కిలో మీటర్ల దూరంలో ఎర్రబోడు తండా వద్ద ఉన్న సాగర్ ఎస్కేప్ ఛానల్ వరకు బ్యాక్ వాటర్‌తో గోదావరి జలాల తరలింపు ప్రమాదకరంగ మారిందని, టీఎల్‌పేట వద్ద నాగర్జునసాగర్ ఎడమ కాలువపై ఎస్కేప్ ఛానల్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొణిదేన కోటేశ్వరరావు, వనమా చిన్న సత్యనారాయణ, కిలారు శ్రీనివాసరావు, శీలం వెంకటరెడ్డి, వెంపటి రాజా, తోటకూర బాబురావు, సామినేని వెంకటేశ్వరరావు, నర్వనేని సత్యనారాయణ తదితరులున్నారు.

కూలిన కల్వర్టు.. రాకపోకలకు అంతరాయం



చింతల చెర్వు వద్ద కల్వర్టుకు పడిన గోతులు

కొణిజర్ల: కొణిజర్ల మండలకేంద్రం నుంచి మల్లుపల్లి వరకు వెళ్లే రహదారిలో చింతల చెర్వు సమీపంలో ఓ కల్వర్టు అడుగున కూలి పైన తారు మాత్రమే ఉండింది. దీంతో సోమవారం ఆ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. ఈ కల్వర్టుకు గతేడాది రంధ్రం పడగా వర్షపు నీరంతా ఆ రంధ్రం గుండా లోపలికి వెళ్లి మట్టి కొట్టుకుపోయింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మరోవైపు కూడా రంధ్రం పడి.. కేవలం తారు మాత్రమే మిగిలింది. దీంతో మల్లుపల్లి, రామనర్సయ్యనగర్‌ల నుంచి వచ్చే ప్రైవేట్ స్కూల్ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు కల్వర్టుపై నుంచి నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఉపాధ్యాయులు, రెండు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి తిరిగే రోడ్డు కావడంతో త్వరగా మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక రీచ్‌లు ప్రారంభం

బోనకల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇసుక సరఫరా చేసేలా మండలంలోని రాయనపేట, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల్లో సోమవారం రీచ్‌లను ప్రారంభించారు. ఈ రీచ్‌లను తహసీల్దార్ ఎం.రమాదేవి, ఎంపీడీఓ ఆర్.రమాదేవి, ఏపీఎం కె.సురేంద్రబాబు మాట్లాడుతూ రీచ్‌ల నిర్వహణను మహిళా సమాఖ్యలకు అప్పగించగా నిబంధనల ప్రకారం ఇసుక సరఫరా చేస్తారని తెలిపారు. లబ్దిదారులు సద్విని యోగం చేసుకుని నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ఝాన్సీ, వీఓఏలు కరుణ, నందిని తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌గా రమేష్

వైరా: వైరాలోని ఐఎంఎల్ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌గా ఏ.రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ బేవరేజేషన్ ఎండీ కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా ఇన్‌చార్జ్ మేనేజర్‌గా పనిచేస్తున్న నారాయణరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో హన్మకొండ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్‌ను వైరాకు బదిలీ చేశారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు ప్రజావాణికి వచ్చి తమ తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. పరిష్కారం చూపాలని అధికారులను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ తదితరులున్నారు.

గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, కొత్తపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి జైబాపూ జై భీమ్ సమ్మిదాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ యాత్రను మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యమేళా నిర్వహించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

ఏన్కూరు: వర్షాలు వస్తున్నందును సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యమేళాను నిర్వహించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని నాచారంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి, కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులలోని వివరాలను కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రాములు, స్వాతి, దుర్గాప్రసాదు, సుజాత పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం



రైతులతో కలిసి వరి విత్తనాలు చల్లుతున్న ఏఓ బాలాజీ, ఏఈఓ హర్షవర్ధన్

కొణిజర్ల: వెదజల్లే పద్ధతిలో వరిసాగు సత్ఫలితాలిస్తుందని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని దిద్దుపూడిలో రైతులు వెదజల్లే పద్ధతిని ఏఈఓ హర్షవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి వెదజల్లు విధానం వల్ల విత్తనాలు తక్కువ పడతాయని, 15 రోజులు ముందుగానే వరి కోతకు వస్తుందని తెలిపారు. నాటు పెట్టడానికి ఎకరానికి 8మంది కూలీలు అవసరం అయితే వెదజల్లు విధానంతో ఒక్కరు రోజుకు 3ఎకరాల్లో వెదజల్లొచ్చన్నారు. దిద్దుపూడి గ్రామంలో ఇప్పటి వరకు 90 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాగమయి



కలెక్టర్ అనుదీప్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనుదీప్ దురిశెట్టిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలిసిన ఆమె కలెక్టర్‌ను సన్మానించాక నియోజకవర్గం అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మట్టా దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కారేపల్లి: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి జయరాజు అన్నారు. సోమవారం కారేపల్లి విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆయా గ్రామ ప్రజలు సహకరించాలని, మన ఊరు బడిలోనే మన పిల్లలను చేర్పించి, విద్యాకుసుమాలు వికసించేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులు హామీలు నెరవేర్చాలి

కల్లూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ హబీబ్, కార్యదర్శి కిన్నెర వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కల్లూరులో సత్తుపల్లి డివిజన్ పరిధిలో కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కన చేపట్టిన శాంతియుత దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలలో 20శాతం కోటా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పకీర్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ముదిగొండ: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం కట్టకూరులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కట్టకూరుకు చెందిన షేక్ మక్కా మదీనకు చెందిన గేదె పొలంలో మేతకు వెళ్లగా.. తెగిపడిన వ్యవసాయ విద్యుత్ మోటారు వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ ఎం.శ్రీనివాస్, పశువైద్యుడు అశోక్, లైన్‌మెన్ వీరభద్రంలు పరిశీలించి, విద్యుత్‌శాఖ నుంచి పరిహారం అందిస్తామని ఏఈ తెలిపారు. తెగిన విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లను తాకొద్దని ఆయన రైతులు సూచించారు.

రుణాలు చెల్లించాలి



బ్యాంకు మేనేజర్ కె.కల్యాణ్

వైరా: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు వైరా యూనియన్ బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని వైరా యూనియన్ బ్యాంకు మేనేజర్ కె.కళ్యాణ్ సూచించారు. సోమవారం వైరాలోని బ్యాంకులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే కొత్తగా రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలతో కేంద్ర ప్రభుత్వం రైతులకు బీమా సౌకర్యం కలిపిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీతో గోల్డు లోన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా క్రాప్‌లోన్‌లు అందించడం జరగుతుందన్నారు మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిమం టైం స్కేల్‌ను ఇవ్వాలని, సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలని, హెల్త్ కార్డులను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు సదాబాబు, చిన రంగ రావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పీడితవర్గాల కోసం పోరాడిన వీరుడు డీవీ కృష్ణ

కొణిజర్ల: పీడిత వర్గాల కోసం తన జీవితాంతం పాటు పడిన గొప్ప నాయకుడు డీవీ కృష్ణ అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లన్ననగర్‌లో తడికమళ్ల సీతారాములు, ఎలదండి బాబుల అధ్యక్షతన నిర్వహించిన డీవీ వర్ధంతి సభలో రంగారావు పాల్గొని మాట్లాడారు. 50 ఏండ్ల పాటు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడన్నారు. పార్టీ జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, కోలేటి నాగేశ్వరరావు, ఎస్‌కే లాల్ మియా, పాశం అప్పారావు, తాళ్ల శ్రీను, గుగులోత్ శివ, కంకణాల పెద్ద వెంకటి, గోగుల వెంకన్న, గోగుల సోములు, మేడి కొండలు, రమణ, పద్మ, జయ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి మాతృమూర్తి అయిలూరి సీతమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రదీప్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్, జీవీఆర్, కోటిరెడ్డి, రామిరెడ్డి, జమలయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సర్వ సాధారణం

పలువురికి ఉద్యోగ విరమణ సన్మానాలు

ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దంపతులకు..

మధిర: ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని ఎంఈఓ వై.ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొని సంక్రాంతి శ్రీనివాసరావుకు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎన్నారైల సాయంతో పలు పాఠశాలలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ కొట్టే వెంకట్రావమ్మ, ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, బంధువులు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సైదయ్యకు..

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన కూరకుల సైదయ్య సన్మాన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సైదయ్య దంపతులను తహసీల్దార్ సీహెచ్. శేషగిరిరావు సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో ఆర్ఎస్ఐ దంపతులకు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్.దసురు దంపతులను బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు సన్మానించి మాట్లాడారు. నలభైఏళ్లుగా తన సర్వీసులో ఎన్నో అవార్డులు, రివార్డులు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ సహాయ దళాధిపతి శ్రీధర్‌రాజ, ఆర్ఎస్ఐలు, కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో.. సీహెచ్ఓ ఆఫీసర్‌కు

తల్లాడ: తల్లాడ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్ఓ)గా విధులు నిర్వర్తిస్తూ పదవీవిరమణ పొందిన భాస్కర్ దంపతులను డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారం, జిల్లా క్షయ నివారణాధికారి సుబ్బారావు సన్మానించారు. సోమవారం తల్లాడ పీహెచ్‌సీలో ఏఓ రత్నమనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భాస్కర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, కల్లూరు డివిజన్ వైద్యాధికారులు నవ్యకాంత్, అవినాష్, కిరణ్‌కుమార్, నీలిమ, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి దంపతులకు..

కల్లూరు: కల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎస్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న నాగపద్మ పదవీవిరమణ పొందడంతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు వరకా రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నాగలక్ష్మి, సాంబశివరావు దంపతులను ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌కే రంజాన్ అలీ, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, సతీష్, రమేష్, అజయ్, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, ప్రభాకర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు..

కల్లూరురూరల్: కల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా సోమవారం పదవీ విరమణ చేసిన ఊటుకూరి వెంకట నాగసత్యనారాయణ శర్మ సేవలు అభినందనీయమని ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో శర్మ దంపతులతో పాటుగా ఆయన తల్లిదండ్రులు ఊటుకూరు పరామ్‌కిషన్‌రావు, సరస్వతిలను ఉద్యోగులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓలు కిషోర్, సురేష్‌బాబు, చంద్రశేఖర్, తహసీల్దార్లు సాంబశివుడు, సురేష్‌కుమార్, కల్లూరు ఎంపీఈఓ రంజిత్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ డీఈ రాంబాబు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నీలాద్రి అర్బన్ పార్క్‌లో.. డీఆర్ఓ ముత్యాలరావుకు..

సత్తుపల్లిటౌన్: అటవీ శాఖలో 37 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సత్తుపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి ముత్యాలరావు అందించిన సేవలు అభినందనీయమని ఎఫ్‌డీఓ మంజుల అన్నారు. స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌లో సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న డీఆర్ఓ ముత్యాలరావు ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి, తల్లాడ, ఏటూరు నాగారం, చంద్రుగొండ రేంజర్లు స్నేహలత, ఉమ, ఎల్లయ్య, రెహ్మాన్, ఏఓ వెంకట స్వామి, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.